# వీరేశలింగంగారి ★ ★ సాహిత్యకృషి

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

• • •

ఈ యుగంలో తెలుగుజాతికి పెద్ద దిక్కుగా పరిగణించ వలసిన వాళ్లు ఇద్దరున్నారు. ఒకరు వీరేశ లింగం పంతులుగారు, రెండోవారు గురజాడఅప్పారావుపంతులుగారు. అప్పారావుగారు మహాకవి; ప్రతి తెలుగువాడు భగవద్గీతకిందరోజూ పఠించ వలసిన ఒక గేయంద్వారా ఒకసమగ్ర జీవితసందేశంఇచ్చాడు. అభ్యుదయ జీవితానికి కావలసిన నీతీ, విశ్వాసాలూ, కార్యక్రమం యావతూ అందులో వుంది.

వీరేశలింగంగారు కర్మిష్ఠి. ఆయన కార్యక్రమం ఒక సందేశంతో తీరిపోయేదికాదు. జాతిని చెవులుపిండి, బుద్ధిచెప్పి, కోప్పడి, కొట్టి అడుగడుగునా విమర్శిస్తూ మంచిమార్గాలు చూపిస్తూ నిజంగానే ఒక పెద్ద దిక్కైవుండి కాపాడుతూ వచ్చారు. గారాబంతో గాని, లేనిపోని మెప్పులతోగాని, లాలనతోగాని ఆయన తెలుగు జాతిని మభ్యపెట్టి, "పాడు"చెయ్య లేదు. మౌఢ్యమూ, మకురు తనమూ బలిసిపోయివున్న యీ జాతి వీరేశలింగంగారి పెంపకానికి లొంగివచ్చిందిగాని, దీన్ని పట్టుకు రావటం మరొకరివల్ల సాధ్య మయ్యేదికాదు.

తన సమకాలికులలో బలవంతుల వర్గాన్ని తన రచనలద్వారా శ్లాఘించీ, రంజింపజేసీ, సమర్థించీ వారి ఆదరాభిమానాలు సంపాదించుకుని వారిచేత బ్రహ్మరథం పట్టించుకోవాలంటే వీరేశలింగం గారికి అసాధ్యమైన పనిగాదు. ఆయనకు బహుభాషా పాండిత్యమూ, వివిధ సాహిత్య సంప

రక్షణమూ, శీఘ్ర రచనాశక్తి ఉండేవి. కాని జాతికి ఎడంగా నిలబడే స్వార్థమూ, జాతియొక్క యోగక్షేమాలను గురించి నిర్లక్ష్యమూ మాత్రమే ఆయనలో లోపించాయి. తల్లి పిల్లలకు ఎడంగా నిలబడి వారి మన్ననల కొరకు తాపత్రయ పడటం ఎంత అసాధ్యమో వీరేశలింగంగారు సాహిత్యంద్వారా స్వార్థం చూసుకోవటం అంత అసంభవం. తన ద్వారా జాతి పైకి రావటమే ఆయన ఆత్మవిశ్వాసం. అదే ఆయనకు కీర్తీనూ.

తన తెలుగుజాతి ఏయే ప్రభావాలవల్ల బాగుపడగలుగుతుంతో ఆయా ప్రభావాలన్నిటికీ వీరేశలింగారు గురికావటం జరిగింది. ఇందులో వింత యేమాత్రమూ లేదు. ఎందుచేతనంటే ఏఏ ప్రభావాల వల్ల ఆయన తెలుగుజాతికి పెద్దదిక్కు కాగలిగాడో ఆ ప్రభావాల నన్నిటినీ ఆయన తన రచనల ద్వారా జాతికి అందించాడు. సాధారణంగా ఇతర రచయితలు ఆత్మసంతృప్తికోసమో, కాకతాళీయంగానో కొన్ని ప్రభావాలకు గురిఅయి, ఆ ప్రభావాలను తమ రచనలద్వారా ప్రపంచంమీద రుద్దేస్తారు. కొంతకాలం జరిగినాక అయినా ఈ ప్రభావాలు సంఘానికి ఉపకరించాయా అని అంచనా కట్టుకోరు. తాము ఆ ప్రభావాల నుండి విముక్తులైనప్పటికీ, వాటితో కూడుకున్న తమ రచనలను ఖండించుకోరు. ఇక, సంఘం అవసరాలను బట్టి పనిపెట్టుకుని కొత్త ప్రభావాలను తమమీద తెచ్చిపెట్టుకోవటమనేది ఒక్క వీరేశలింగంగారికే చెల్లిపోయింది.

మొదట్లో వీరేశలింగంగారు అప్పటి కవిపండితుల ప్రభావానికి లోనైనవారై ప్రబంధ, చిత్ర, బంధాది కవిత్వాలు చేశారు. కాని వాటిమీద ఆయనకు త్వరలోనే విసుగుపుట్టింది. కాని యీ రకం కవిత్వం రాయటంవల్ల ఆయన సమకాలికుల దృష్టిలో ఆయనకు సాహిత్య పట్టభద్రత లభించి వుండాలి.

వీరేశలింగంగారి ఇతరరచనల్లో వివిధ ప్రభావాలు కనిపిస్తాయి.

ఇంగ్లీషులో నుంచి షేక్స్పియరు నాటకాలూ, షేక్స్పియరు నాటక కథలూ, గలివర్స్ట్రావెల్స్ మొదలైనగ్రంథాలకుతర్జుమాలున్నాయి. వికర్ ఆఫ్ వేక్ ఫీల్డ్ నవలను అనుసరించి రాజశేఖర చరిత్రమనే నవల ఒకటి ఉన్నది. ఏసు చరిత్రఉన్నది. రసాత్మకంగానూ, సంస్కారదృష్టితోనూ రచించిన ప్రహసనాలున్నాయి. విద్యార్థులఉపయోగం కోసం వాచకపుస్తకా లున్నాయి. సంస్కృతంనుంచి తర్జుమాచేసిన శాకుంతలమూ, రత్నావళీనాటకాలున్నాయి. సంఘాన్ని విమర్శిస్తూ, ప్రజలకు ఉద్బోధచేస్తూ వ్యాసాలున్నాయి. తర్కమూ శరీరశాస్త్రమూ మొదలైనశాస్త్ర గ్రంథాలున్నాయి. అద్భుతపరిశోధనతోకూడిన కవులచరిత్ర ఉన్నది.

సంఘందృష్టి తనమీదికి తిప్పుకుని తన గొప్పతనం సంఘానికి చెప్పి గొప్పవాడనిపించుకునేటందుకు తాపత్రయపడేవాడు ఇన్నిరకాల రచనలకు పూనుకోడు. కవిత్వం రాసేవాడికి గద్యరాద్దామంటే ఆ కాస్తకీర్తీ పోతుందేమో నని భయం. కథకుడుగా పేరుపడ్డ వాడికి నాటకాలు రాయటమంటే భయం. అటువంటిపరిస్థితిలో వీరేశలింగంగారు కేవలమూ ఆత్మసంతృప్తి కోసమే ఇంత సాహిత్యకృషిచేసి ఉండటం అసంభవం.

ఇందులో మరొక వింతకూడా ఉంది. సంఘకార్యం ఏది నెత్తిన వేసుకున్న వాడుకూడా సాహిత్యం జోలికిరాడు. మన రాజకీయ వేత్తలూ, సంస్కారులూ, నటకులూ, తదితర గౌరవనీయులూ సాధ్యమైనంతవరకు కలంపట్టరు. కీరికాముల్లై ఉండటంచేతనో ఏమో, వారికితాము చేసేపనిమీద ఉండేశ్రద్ధ ప్రయత్న ఫలితాల మీద ఉండదు. తాముచేసేప్రయత్నం సమగ్రంగా ఫలించాలంటే సాహిత్య సహాయం ఉండితీరాలి. వీరేశలింగంగారికి ముందుగాని వెనకగాని సంఘసేవ చేసినవారు తమకు సహకారిగా సాహిత్యం సృష్టించిందిలేదు. అయితే వీరేశలింగంగారుఒక్కరే ఈపనిచేశారు. ఒకవంక వితంతు వివాహాలు చేయిస్తూ తుచ్ఛమూఢాచారా

లను ఎదుర్కొంటూ, సంఘవిద్రోహులను ఎదిరించి శత్రువులను చేసుకుంటూ, అవసరమైనప్పుడల్లా సంఘాన్ని అంతనీ కూడా ఎదిరించి పోరుతూ, జనసామాన్యంలో వివేకమూ విజ్ఞానమూ పెంపొంది తన ఆశయం సిద్ధించగలందులకు, తన సంతానమైన ఆంధ్రజాతి అభివృద్ధికి రాగలందులకు, పత్రికల ద్వారానూ పుస్తకాలద్వారానూ అపారమైన కృషిచేశారు. ఇది అనన్య సామాన్యమైన విషయం.

వీరేశలింగంగారు తనమీద ఉండిన ప్రభావాలు జాతికి ఉపకరించవనితోచినప్పుడు వాటినితోసిపుచ్చటమేగాక, జాతియొక్క క్షేమంకోసం పనిపెట్టుకుని కొన్ని ప్రభావాలు తెచ్చిపెట్టుకున్నారు. పాతగ్రంథాలను ఉద్ధరించటమూ, కవుల చరిత్రకోసం పరిశోధనలు సాగించటమూ కాక, శాస్త్ర గ్రంథాలు రాయటానికి ఆయన పడిన శ్రమ అతి విచిత్రమైనది. ముఖ్యంగా శరీరశాస్త్రం రాసేటప్పుడాయనకు శరీరభాగాలు ప్రత్యక్షంగా చూసి తెలుసుకుని స్వానుభవంతో రాయాలనే కోర్కె కలిగింది. అందుకుగాను వైద్యవిద్యార్థుల సహాయంతో శవశస్త్రశోధన జరిగేచోటికి వెళ్లి ఆదృశ్యం భరించలేక ఆయన స్పృహతప్పి పడిపోవటం తలుచుకుంటే ఆయన కార్యదీక్ష బోధపడుతుంది. ఆవిధంగానే వాడుకభాషవిషయంకూడా. చివరదశలో గిడుగు రామమూర్తి పంతులుగారి వాదాన్ని ఆమోదించి దానివల్ల ప్రజలకు అధిక లాభంవున్నదని గ్రహించి ఆ ఉద్యమానికికూడా సహాయపడ్డారు. సంఘం సహస్రపాత్తు. దానిప్రతి ఒక్క కాలిచేతా, అవసరమైతే స్వహస్తాలతో, ముందుకు ఒక్క అడుగు వేయించటానికి దీక్షవహించిన మహాపురుషుడు వీరేశలింగం

వీరేశలింగంగారి రచనలు చూసి ఈనాడు, ఆయన శైలి సరళంగానూ ధారాళంగానూ ఉన్నప్పటికీ, అందులో జిగిలేదనీ, కవిగా గాని గద్యకారుడుగా గాని వీరేశలింగంగారు గొప్ప ప్రతిభాసంపన్నుడు కాడనీ, ఆయన శిల్పంలో చెప్పుకోదగ్గ విశిష్టత

లేదనీ అనుకోవటంమనకు చాలా సులభంకావచ్చు. ఈమాట స్వీయచరిత్రలో ఆయనే చెప్పుకున్నారు. ఒకసారి రాసినది తిరిగి చూడడం గాని తుడుపులూ, హంసపాదులూ పెట్టటంగాని ఆయనకు అలవాటు లేదు. ఆ అలవాటే ఉంటే తన రచన మరింత ఆకర్షవంతంగా ఉండి ఉండునని ఆయనకూ తెలుసును. కాని కేవలమూ ప్రజల నాకర్షించటానికి తనరచనలకు పులికాపు చేస్తూకూర్చున్నట్లయితే ఆయనకు ఇంత విశాలమైన సాహిత్యకృషి సాధ్యమై ఉండేదికాదు. ఆయన రచనలద్వారా ప్రజలు పొందే ప్రయోజనంకంటె ఆయనకు వచ్చే కీర్తే ఎక్కువగా ఉండేది.

ఒకవేళ వీరేశలింగంగారు తన రచనలను తీర్చిదిద్దటానికి ప్రయత్నించి ఒకటికి పదిసార్లు తిరిగి చూసుకున్నప్పటికీ శిల్పదృష్టితో చూస్తే ఆయనరచనలు ఇప్పటిలాగే ఉండేవనుకున్నప్పటికీ వీరేశలింగంగారి ఘనతకు హానికలగదు. ఎందుకంటే సాహిత్యం రచించటంలో ఆయన ఆశయం సాహిత్యపరమైనదికానేకాదు; సంఘపరమైనది సాహిత్యసేవా వ్యాజంతో ఆయన సంఘసేవ సాగించారు. ఈనాటి కవులలాగానూ, కథకుల

## సంధి లేదు ♦ ♦ ♦

[ 39 వ పేజీ నుండి ]

"ఏమిటీ వెతుకుతున్నారూ? — ఇదుగో!!" — మోతేమిలాం శిరస్సు రామిరెడ్డి పాదాలదగ్గిరికి దొర్లుకొచ్చింది.

నెత్తుటితో తడిసిన పటాకత్తి, రుద్ర చేతిలోనుంచి జారి క్రిందబడ్డది. రుద్ర తూలుకుంటూవచ్చి శిబిరద్వారంలో భర్త పాదాలదగ్గిర పడిపోయింది. జల్లెడ తూట్లుగా సన్నీలు పొడుచుకొని శరీరమంతా రక్తాలోడిపోతోంది

"రు...ద్రా!" — కన్నీటితో గద్గదంగా గొణిగి, భార్య శిరస్సు తొడమీదకు తీసుకోబోయాడు రామిరెడ్డి.

"చచ్చిపోతున్నాను — యీ సైజాం పిశాచం నన్ను నడివీధిలో చీరలొల్చి మానభంగం చేయించాడు..." — వలవలా యేడ్చింది.

రామిరెడ్డి వృద్ధికుడై లేచి భార్య జారవిడిచిన పటాకత్తి చేత్తోబుచ్చుకున్నాడు.

"వాణ్ణీ, వాడి కిరాత రాజ్యాన్నీ ఈ పటాకత్తికి బలిబెడతాను — వాడితో మనకిక సంధిలేదు."

"సంధిలేదు !!!" — చుట్టూవున్న ప్రజాసైన్యం సముద్ర సంఘోషణంగా ఘూర్ణిల్లిపోయింది.

లాగానూ ఆయన తన రచనల ద్వారా తన సమకాలికులకు ఒక అనిర్వచనీయమైన ఆనందం ఇవ్వ లేదనే విషయం ఆయనకేలాటి మచ్చా కాదు గాని, ఈనాటి రచయితలు తమ రచనలద్వారా వీరేశలింగంగారిలాగా సంఘాన్ని ఉత్తేజపరచలేక పోతున్నారనేది వీరికి తప్పక కళంకమే. వీరేశలింగంగారు ఆ రచనలన్నీ చెయ్యకుండా ఉంటే బాగుండేదా, వాటిద్వారా మహోన్నతమైన సాహిత్య శిల్పం ప్రదర్శించివుంటే బాగుండేదా అనేసమస్య బుద్ధిమంతు డెవడికీ కలగదని నా దృఢ విశ్వాసం.

వీరేశలింగంగారిలో ఆధునికతా, వాస్తవికదృష్టి లేదనుకో వద్దు. అది శిల్పంలో లేదు. విషయంలో కుప్పలు తెప్పలుగా ఉన్నది. ఆయన రచించిన రాజశేఖర చరిత్ర తీసుకుంటే అందులోని కథాంశం అభూతకల్పనగా తోచవచ్చు. కాని అందులో పాత్రలన్నీ యథార్థమైనవే; ఆ గ్రంథంలో వీరేశలింగంగారు చేసిన సంఘవిమర్శ ఈనాటికికూడా మన సంఘానికి డొక్కలో బల్లెమే. పాశ్చాత్య సాహిత్య శిల్ప ప్రభావాలకు గురిఅయిన మనకు వీరేశలింగంగారి శిల్పం పాతదిగా కనిపించినంత మాత్రంచేత ఆయన రచనా ధోరణిలోవున్న జాతీయతను మనం విస్మరించరాదు.

ఈనాటికైనా మనం వీరేశలింగంగారి సాహిత్యలక్ష్యాన్ని ఆరాధించగలిగితేనే అభ్యుదయ రచనలు చెయ్యగలుగుతాముగాని అరువు తెచ్చుకున్న శిల్పాలతో వ్యామోహితులమై కూర్చుని ప్రయోజనంలేదు. శిల్పం విషయంలో మనం వీరేశలింగంగారిని దాటి యెంతదూరం పోయినా, ఆయన పెట్టుకున్న లక్ష్యాన్ని ఏమరనంతకాలమూ, నష్టంలేదు కూడానూ.

□